మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక




జనగామలో
## ఇండ్ల మధ్య మంటలు
- కట్టడి చేసిన అగ్నిమాపక శాఖ

4

సంపుటి : 01 | సంచిక : 179 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 29 మే 2026 | పేజీలు : 4




## జూన్ 4లోగా కొనుగోలు
# పూర్తి చేయాలి

- గన్నీ సంచుల కొరత లేదు..
- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2

ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలోని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.



## లారీలు రావు.. సంచులు నింపరు..
- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అట్టర్ ప్లాఫ్
- వారంలో పంట కొనకుంటే మహాధర్నా
- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

3 లో




wanted
విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..
మన చౌరాస్తా
The Complete News way




# జూన్ 4లోగా కొనుగోలు పూర్తి చేయాలి

- గన్నీ సంచుల కొరత లేదు..
- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్క జొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరస రఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలోని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య సిరిసిల్ల, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, హనుమకొండ పశ్చిమ, పరకాల, భూపాలపల్లి, ఘనపూర్ (స్టేషన్), వర్ధన్నపేట, హుస్నాబాద్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరి, కెఆర్ నాగరాజు, పాడి కౌశిక్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాం రెడ్డి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్పాయి, సత్య శారద, సందీప్ కుమార్ ఝా, భోర్కడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, ఈ యాసంగి సీజన్‌కు అవసరమైన 24 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు గన్నీ సంచులను వెంటనే పంపిస్తున్నామని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జూన్ 4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో, జూన్ 3వ తేదీలోగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. అవసరమైతే అదనపు లారీలు, డీసీఎంలను కేటాయించుకొని ధాన్యం, మొక్కజొన్న తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు. జిల్లాల వారీగా గోదాములలో నిల్వ స్థలాల కేటాయింపుపై పరస్పరం సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను ఆదేశించారు. జనగామ జిల్లాకు యాదాద్రి జిల్లాలో, వరంగల్ జిల్లాకు భూపాలపల్లి జిల్లాలో నిల్వ స్థలాలు కేటాయించాలని సూచించారు. అవసరమైతే ప్రైవేట్ గోదాములను కూడా వినియోగించుకోవాలని కలెక్టర్లకు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో యాసంగి సీజన్‌కు సంబంధించి 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది రైతులకు రూ. 10,500 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా చేయకపోయినా రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించే రైస్ మిల్లర్లకు అదనపు బాయిల్డ్ రైస్ లక్ష్యాల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు, సివిల్ సప్లై అధికారులు, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రైతులు పండించిన ప్రతి గింజను మిగలకుండా కొనుగోలు చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్ మిల్లర్లపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల మధ్య గోదాముల కేటాయింపుల విషయంలో కలెక్టర్లు, పౌర సరఫరాల కమిషనర్ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ మేరకు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,55,243 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 14,08,329 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించడం జరిగిందని, అలాగే 24,258 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 292 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 1,28,083) మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందని, మొత్తం 572 మంది హమాలీలు ఉన్నారని వివరించారు. జిల్లాలో యుద్ధ ప్రాతిపదికన రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. లారీలు, ట్రాక్టర్లు, ఇతరత్రా వాహనాల ద్వారా మిల్లులకు తరలిస్తున్నామని, అలాగే సరిపడా హమాలీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పూర్తి ప్రక్రియను నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేస్తామని తెలిపారు.



# ‘అన్నార్తుల ఆకలి తీరుద్దాం’

## – జనగామ అమ్మ ఫౌండేషన్ పిలుపు

**జనగామ, మన చౌరాస్తా :** అన్నార్తుల ఆకలి తీర్చడంలో అందరూ భాగస్వాములు కావాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ పిలుపునిచ్చారు. గురువారం జనగామ పట్టణానికి చెందిన స్వప్న పుట్టినరోజు సందర్భంగా జనగామ రైల్వే స్టేషన్‌లో యాచకులు, పేదలకు, ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్లు, వారి బంధువులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మణి, భీమ్రాజ్ మాట్లాడుతూ.. దేశంలో ఆకలి చావులు లేకుండా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఆకలితో బాధపడుతున్న నిరాశ్రయులు, నిరుపేద కుటుంబాలు, అనాథలకు కనీసం ఒక పూట భోజనం అందించి మానవత్వాన్ని చాటుకోవాలని యువతను కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు గుగులోత్ ప్రభాకర్, సిద్ధిరాల చందు, నారదాసు రవి, సాయి తేజ, సాకేత్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



# దళితరత్న వేలంగిణికి సర్పంచ్ సత్కారం

**నర్మెట, మన చౌరాస్తా :** ‘దళితరత్న’ అవార్డు గ్రహీత ఏనుగుల వేలంగిణిని స్థానిక సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్, ఉపసర్పంచ్ కొలేపాక స్వామి గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. వేలంగిణి సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తూ మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం వారి సేవలను గుర్తించి ‘దళితరత్న’ అవార్డు ప్రదానం చేయడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ కొలేపాక స్వామి మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్న వేలంగిణి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొలిపాక యాదగిరి, నిమ్మకంటి బాపురాజు, చెప్పాల విజయ్, కొంపెల్లి సురేష్, మానేపల్లి వినయ్, గుండె రాజు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏనుగుల వేలాంగిణికి అభినందనలు తెలిపారు.

# ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించాలి



**కాజీపేట, మన చౌరాస్తా:** మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను కాజీపేట ఫాతిమా నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహానాడు వర్చువల్ కార్యక్రమంలో రఘునాథపల్లి మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. రఘునాథపల్లి మండల పార్టీ అధ్యక్షులు బొక్క రామచంద్రయ్య, రాష్ట్ర నాయకులు ఎడ్ల మల్లేశం, మండల నాయకులు అడ్డూరి శ్రీనివాసు, సాతర్ల రవి, యాదగిరి, మధుసూదన్ తదితరులు మహానాడును ఆన్లైన్లో వీక్షించారు. అనంతరం నాయకులు ఎన్టీఆర్ ఫొటోకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ‘సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు’ అనే ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

# లారీలు రావు.. సంచులు నింపరు..

- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్
- వారంలో పంట కొనకుంటే మహాధర్నా
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూర్, మన చౌరస్తా: ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్టేషన్ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. చిల్పూర్ మండలంలోని లింగంపల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కొనుగోలు కేంద్రంలో తాగునీరు, నీడ, రవాణా, రాత్రిపూట విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అరిగోస పడుతున్నారని విమర్శించారు. గన్నీ బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని, మిల్లర్ల వద్ద అదనపు తూకాలు వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 'గన్నీలు ఉంటే లారీలు రావు.. లారీలు వస్తే ధాన్యం దించుకోరు' అన్నట్లుగా కొనుగోలు ప్రక్రియ పూర్తిగా గందరగోళంగా మారిందని పేర్కొన్నారు.

**రైతులు ఇబ్బందులు పడుతుంటే ఫ్లెక్సీల రాజకీయమా..?**

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. వారం రోజుల్లో ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేస్తామని చెప్పి ఇప్పుడు రైతులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు కళ్లాల్లో అరిగోస పడుతుంటే అభివృద్ధి పేరుతో ఫ్లెక్సీల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సింది పోయి, ఉన్న కరెంటును కూడా సరిగా ఇవ్వడం లేదన్నారు. రైతు సమస్యలను పక్కన బెట్టి కోట్ల రూపాయల అభివృద్ధి ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. వారం రోజుల లోపు ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయకపోతే రైతులను కూడగట్టుకుని మహాధర్నా నిర్వహిస్తామని మాజీ డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా హెచ్చరించారు.



## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

- భూ రక్షణ సమితి డిమాండ్
- ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీలు ఎన్నిక

**వరంగల్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్రంలోని అసైన్డ్ భూముల రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వరంగల్‌లో భూ రక్షణ సమితి సమావేశం నిర్వహించారు. గురువారం నత్తి కోర్నెల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి భూ రక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుగ్గ మైసన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నూతన కమిటీలను ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జిగా నత్తి కోర్నెల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కందికట్ల రాజయ్య, హన్మకొండ జిల్లా అధ్యక్షుడిగా పాముల రమేశ్, జనగామ జిల్లా అధ్యక్షుడిగా మిద్దెపాక మహేందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పందుల సారన్న, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా మంద సాబయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడిగా పెండేల సుందర్ నియమితులయ్యారు. అలాగే అర్షం అశోక్‌ను రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిద్దెపాక సిద్దులు, ఎస్సీ & ఎస్టీ అల్ట్రా సిటీ చైర్మన్ దళిత రత్న డబ్బేట రమేష్‌తో పాటు ఉమ్మడి జిల్లాలకు చెందిన అసైన్డ్ భూముల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూముల పట్టాదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, భూముల కొనుగోలు-అమ్మకాలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- నలుగురు అరెస్టు

**నర్మెట, మన చౌరాస్తా:** నర్మెట మండల పరిధిలోని మాన్సింగ్ తండా గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మెరుపు దాడి చేశారు. మాన్సింగ్ తండా సమీపంలోని శ్మశాన వాటిక వద్ద కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే దాడులుచేపట్టి నలుగురిని అరెస్ట్ చేసినట్లు నర్మెట్ట ఎస్ఐ నాగేష్ తెలిపారు. అరెస్ట్ చేసిన వారి వద్ద నుంచి రూ.2,930 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

## 30న నర్మెట్టలో కన్వర్జెన్స్ సమావేశం

- మీటింగ్ మౌలిక వసతులపై చర్చ



**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కావ్య శ్రీనివాసన్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, గ్రామపంచాయతీల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలు, గ్రామీణ సమస్యలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా సంబంధిత శాఖలకు సంబంధించిన నివేదికలు, వివరాలు వెంట తీసుకురావాలని అధికారులను కోరారు.



## లారీల కోసం రైతులు ఎదురుచూపులు

– టోల్‌గేట్ వద్ద ఆందోళన

**రఘునాథపల్లి, మన చౌరాస్తా:** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి సరైన కొనుగోలు లేక రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కోమల్ల టోల్‌గేట్ వద్ద ధాన్యం తరలించేందుకు లారీల కోసం రైతులు వేచి ఉండగా, వారికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు వారాల రమేష్ యాదవ్ సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకున్న రమేష్ యాదవ్ వెంటనే స్థానిక తహసీల్దార్ రాకేష్ రెడ్డి, ఎస్సై నరేష్ యాదవ్‌లకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే లారీలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి తండా సర్పంచ్ పయ్యావుల రవి యాదవ్, మాజీ ఎంపీటీసీ మాలోత్తు నర్సింహా నాయక్, స్థానిక రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

– సింగపురం ఇమ్మానియేల్ రాజ్



**జాఫర్ గడ్, మన చౌరాస్తా :** కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా కొడుకు, యువ నాయకుడు ఇమ్మానియేల్ రాజ్ అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రాడపాక రాజ్ కుమార్ మామయ్య తాటికాయల బాబు ఇటీవల వడదెబ్బ తగిలి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఇమ్మానియేల్ రాజ్ గురువారం జాఫర్ గడ్ మండలం వడ్డెగూడెంలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగపురం కుటుంబం తమను నమ్ముకున్న ప్రతి కార్యకర్త కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలను ఆదుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య, జనగామ జిల్లా కార్యదర్శి తాటికొండ సంపత్ కుమార్, సీనియర్ నాయకుడు రాడపాక డేనియల్, బీసీ సెల్ నాయకుడు కండ్లకోలు బాలరాజు, వెంకటేశ్వరపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బట్టమేకల శివరాజ్, కర్రెల్లి రాజ్ కుమార్, సింగపురం ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల మధ్య ఎగిసిన మంటలు

- జనగామ కోటిరత్న హాస్పిటల్ వెనుక అగ్నిప్రమాదం
- ఇండ్ల వైపు దూసుకొచ్చిన మంటలు
- కట్టడి చేసిన అగ్నిమాపక శాఖ



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో కోటిరత్న హాస్పిటల్ వెనుక భాగంలో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. పగిటిపాటి దేవయ్య ఎన్నారై కుటుంబానికి చెందిన సుమారు మూడున్నర ఎకరాల ఖాళీ స్థలంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి గాలికి వేగంగా వ్యాపించాయి. మంటలు భారీగా ఎగిసిపడటంతో సమీప కాలనీల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు ఇళ్లవైపు వ్యాపించే ప్రమాదం ఉండటంతో స్థానికులు తమ ఇళ్లలోని బోర్లను ఆన్ చేసి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. ఆలేరు నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ మంటలను అదుపు చేసినప్పటికీ, కొద్దిసేపటికే మళ్లీ మంటలు చెలరేగాయి. స్థానికులు మూడో వార్డు కౌన్సిలర్ జ్యోతికి సమాచారం అందించగా, ఆమె వెంటనే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, సీఐ సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డిలకు సమాచారం ఇచ్చారు. అనంతరం సీఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి జనగామ ఫైర్ ఇంజన్‌తో పాటు మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌ను రప్పించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి మాట్లాడుతూ, పట్టణ శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో గడ్డి, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల ఇలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులతో శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# నర్మెటలో భక్తి శ్రద్ధలతో బక్రీద్

**నర్మెట, మన చౌరాస్తా :** బక్రీద్ పండుగ సందర్భంగా నర్మెట్ట ఈద్గా మైదానం భక్తి శ్రద్ధలతో కళకళలాడింది. తెల్లవారుజామునే పెద్ద ఎత్తున ముస్లింలు ఈద్గా మైదానానికి చేరుకుని ప్రత్యేక ఈద్ నమాజ్‌లో పాల్గొన్నారు. జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రార్థనల్లో జామియా మస్జీద్ ఇమామ్ మహమ్మద్ తన్వీర్ ఖుత్బా నిర్వహించి, బక్రీద్ పండుగ ప్రాముఖ్యత, త్యాగం, సోదరభావం గురించి సందేశం ఇచ్చారు. అనంతరం ప్రత్యేక నమాజ్ నిర్వహించగా ముస్లింలు భక్తి భావంతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దేశం శాంతి సౌభాగ్యాలతో అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక దువాలు చేశారు. నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ ఆక్టివిస్ట్ మహమ్మద్ తఫ్జిల్, ప్రెసిడెంట్ అలీం, ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

**త్యాగానికి ప్రతీక బక్రీద్ : సర్పంచ్ శ్రీధర్ గౌడ్**

నర్మెట సర్పంచ్ గోపాగోని శ్రీధర్ గౌడ్ ముస్లింలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్‌ను ఈదుల్ ఖుర్బానీ అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. “బకర్” అంటే జంతువు అని, జంతువును ఖుర్బానీ ఇచ్చే పవిత్ర వేడుక కావడంతో దీనికి ఆ పేరు వచ్చిందన్నారు. త్యాగం, ప్రేమ, సోదరభావానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, శాంతి, ఆరోగ్యం నింపాలని ఆకాంక్షించారు.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**